www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 21 | ఫిబ్రవరి | 2026
పేజీలు : 8

# పార్టీ విస్తరణ, ప్రజా పోరాటాలే లక్ష్యం

-అధర్మ యుద్ధంలో ధర్మంగా గెలిచాం
-కౌన్సిలర్ల అభినందన సభలో సిపిఐ నేత కూనంనేని




**ప్రజాపక్షం/ఖమ్మం :** పార్టీ విస్తరణ, ప్రజా ఉద్యమ నిర్మాణమే లక్ష్యంగా పనిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పలు చోట్ల అధర్మ యుద్ధం జరిగిందని సిపిఐని ఒంటరిని చేసి ఓడించేందుకు ప్రయత్నాలు జరిగాయని అధర్మ యుద్ధంలోనూ ధర్మంగా గెలిచామని ఆయన తెలిపారు. సిపిఐ పక్షాన ఏదులాపురం, వైరా మున్సిపాలిటీలలో గెలుపొందిన కౌన్సిలర్ల అభినందన సభ శుక్రవారం సిపిఐ కార్యాలయంలో జరిగింది. దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నికలు ఒక బాగమని ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పొత్తు ధర్మాన్ని పాటించలేదన్నారు.

మిగతా 2లో..

# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

-ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం పెంచాలి
-పదోన్నతి నియామక పత్రాలు అందజేసిన కలెక్టర్



2లో..



# పార్టీ విస్తరణ, ప్రజా పోరాటాలే లక్ష్యం








(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర వ్యాప్తంగా 41 చోట్ల మున్సిపల్, కార్పోరేషన్లలో విజయం సాధిస్తే అందులో 30 స్థానాల్లో సిపిఐ ఒంటరిగానే పోటీ చేసి గెలిచిందన్నారు. ఐదు చోట్ల కాంగ్రెస్ మద్దతు, ఆరు చోట్ల బిఆర్ఎస్ మద్దతుతో పోటీ చేసి విజయం సాధించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో గెలుపు ప్రజలు హర్షించేవిధంగా ఉండాలి తప్ప ఏదో ఒకవిధంగా గెలవాలన్న ఆలోచన ప్రమాదకరమైందని అది ప్రజామోదం పొందదని కూనంనేని తెలిపారు. అధికార యంత్రాంగం సైతం ప్రజాస్వామ్య పద్ధతులను పరిరక్షించేందుకు కృషి చేయాలని అధికారంలో ఉన్న వారు ఏమి చెబితే అది చేయడం ఉద్యోగ ధర్మం కాదని సాంబశివరావు సూచించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమే అయినా గెలుపును స్ఫూర్తిగా తీసుకోవాలని ఓటమి నుంచి విజయం వైపు అడుగులు వేయాలని ఆయన సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పట్టుదలతో పనిచేసి విజయం దిశగా పార్టీని నడిపించాలని ఆయన కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. ఏదులాపురం మున్సిపాలిటీలో గెలుపొందిన దండి రంగారావు, మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, దండి శ్రీజ, వైరా మున్సిపాలిటీలో గెలుపొందిన నల్లమోతు శైలజను కూనంనేని ఘనంగా సన్మానించారు. కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ అద్భుత విజయం సాధించిన సందర్భంగా ఖమ్మంజిల్లా నాయకులు కూనంనేనిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, బిజి క్లెమెంట్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విధుల పట్ల నిబద్ధతతో ఉంటూ, ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచుతూ కొత్తగా నియమితులైన ఉద్యోగులు జవాబుదారితనంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్ నందు ఖమ్మం రెవెన్యూ శాఖలో పదోన్నతులు పొందిన 15 మందికి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ నియామక పత్రాలను అందజేశారు. జిల్లా రెవెన్యూ శాఖలో విధులను నిర్వహిస్తున్న 15 మంది నాలుగో తరగతి డ్రైవర్లు, రికార్డ్ అసిస్టెంట్ కేటగిరీ ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించిన సందర్భంగా తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు స్వీకరిస్తున్న సిబ్బంది విషయ పరిజ్ఞానాన్ని, విధుల పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. డ్రాఫ్టింగ్, కంప్యూటర్ వినియోగంపై పట్టు సాధించాలని సూచించారు. నిరంతరం నేర్చుకునే తత్వాన్ని అలవర్చుకుని ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రజలకు త్వరితగతిన పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నిబద్ధతతో విధులు నిర్వహించి ప్రజా సేవలో ముందుండాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థను బలోపేతం చేసేందుకు పోస్టింగ్ ఎక్కడ వచ్చిన మంచి పనిచేస్తే గుర్తింపు వస్తుందని, ఉత్తమంగా పనిచేస్తున్న వారికి ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఉత్తమ సేవలతో పనిచేసే శాఖకు, జిల్లాకు మంచి పేరు తేవాలని కలెక్టర్ తెలిపారు. ట్రెసా జిల్లా అధ్యక్షులు తుంబూరు సునీల్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెసా జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ డివిజన్ల ప్రతినిధులు, కలెక్టరేట్ యూనిట్ సభ్యులు, పదోన్నది పొందిన ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# సబ్ స్టేషన్ నిర్మాణాన్ని అడ్డుకున్న రైతులు

## -గ్రామంలో ఉద్రిక్తత

**ప్రజాపక్షం/ బోనకల్ :** అనేక దశాబ్దాలుగా తమ అధీనంలో ఉండి 2013 వరకు ప్రభుత్వ రికార్డుల్లో తమ భూమిగా నమోదైన దానిలో సబ్ స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టడాన్ని నిరసిస్తూ రైతులు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఈ ఘటన శుక్రవారం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మందడపు నారాయణకు బ్రాహ్మణపల్లి గ్రామంలో సర్వే నెం. 116లో భూమి ఉంది. తాత, తండ్రుల నుంచి వారసత్వంగా లభించింది. ప్రభుత్వ రికార్డుల్లో 2013 వరకు నారాయణరావు భూమిగా రికార్డుల్లో ఉండగా ఆ తర్వాత భూ వివరాలు లభ్యం కాలేదు. అయితే ఈ భూమిలో సబ్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించినట్లు తెలవడంతో రైతులు గత కొంత కాలంగా తమ భూమిలో సబ్ స్టేషన్ నిర్మించవద్దని ఉన్నతాధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. అయినా శుక్రవారం అదే స్థలంలో నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులు రాగా అడ్డుకున్నారు. దీనితో గ్రామంలో ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు నిర్మాణ పనులను అడ్డుకున్న రైతులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రైతు మందడపు రామారావు మాట్లాడుతూ అనేక దశాబ్దాల నుండి ఈ భూమిని తాము అనుభవిస్తున్నామని మాకు తెలియకుండా ఈ భూమిని సబ్ స్టేషన్‌కు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. జేసిబి ముందు కూర్చుని ఆయన నిరసన తెలిపారు. ఎస్ఐ వెంకన్న రైతులతో చర్చించారు. తమకు అన్యాయం చేస్తూ అధికారులు భూమిని విద్యుత్ సబ్ స్టేషన్‌కు అప్పగించారని మాకు ఈ భూమి తప్ప మరో ఆధారం లేదని తెలిపారు.

# ఉపాధి హామీలో పనులను త్వరితగతిన పూర్తి చేయండి

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధి హామీ శాఖ అధికారులకు ఆదేశించారు. కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు, లక్ష్మీ పురం, ఎర్ర బోయినపల్లి, బత్తులపల్లి ,పేరువంచ, తెలగవరం, పోచవరం, పెద్ద కోరుకొండి, చంద్రుపట్ల , ముగ్గు వెంకటాపురం తదితర గ్రామాలలో 30% పనులు పెండింగ్లో ఉన్నాయని పాత పనులన్నీ పూర్తి చేసి కొత్త పనులకు దరఖాస్తులు చేయాలని డిఆర్డిఏ పిడి శ్రీరామ్ తెలిపారు. కల్లూరు లోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ మరియు ఐకెపి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గత సంవత్సరం చేపట్టిన పనులు పూర్తిచేయాలని పాత పనులు పూర్తి చేసిన తర్వాతనే కొత్త పనులు చేపట్టాలని లేనిచో కొత్త పనులు మంజూరు కావని తెలిపారు. లక్ష్యాలను అధిగమించాలని పంచాయతీ కార్యదర్శులను ఉపాధి హామీ సిబ్బందిని కోరారు. అదేవిధంగా పెనుబల్లి, వేంసూరు, మండలాలలో ఐకెపి సిబ్బందిపై స్త్రీ నిధి నిధులు పై




ఫిర్యాదులు అందుతున్నాయని అలాంటివి లేకుండా చూడాలని కల్లూరు ఎపిఎంకు ఆదేశించారు. ఐకెపి సిబ్బంది ఉపాధి హామీ సిబ్బంది విధులు పట్ల నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడి చలపతి, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో హేమమాలిని, జేఈ పుల్లారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఐకెపి ఏపిఎం అశోక, రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

# చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు శిక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్షతో పాటు రూ. 12 లక్షలు చెల్లించాలని ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ శుక్రవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే... ఖమ్మం పట్టణంకు చెందిన మేదమెట్ల శ్రీనివాసరావు వద్ద తిరువూరుకు చెందిన కె. రాజేంద్రప్రసాద్ 2016లో రెండు దఫాలుగా రూ.10 లక్షలు అప్పు తీసుకున్నాడు. అదే రోజు ప్రాంసరీ నోటు రాసిచ్చాడు. అప్పు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయడంతో బ్యాంకు చెక్కు ఇవ్వగా ఖాతాలో నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురైంది. మేదరమెట్ల శ్రీనివాసరావు ఆర్. నారాయణస్వామి ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి ప్రైవేటు కేసు దాఖలు చేశారు. సాక్ష్యులను విచారించిన అనంతరం ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 12 లక్షలు చెల్లించాలని తీర్పునిచ్చారు.

# మతసామరస్యానికి కృషి చేసిన ఛత్రపతి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మతసామరస్యానికి కృషి చేసిన వారిలో ఛత్రపతి శివాజీ ఒకరని ఆధిపత్య కులాలను కాదని రాజ్యాంగాన్ని ఆధిష్టించి మరాఠ సామ్రాజ్యాన్ని స్థాపించిచ మహోన్నతుడు ఛత్రపతి శివాజీ అని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మహ్మద్ సలాం తెలిపారు. ప్రస్తుత బిజెపి చెబుతున్నట్లుగా హిందూ సామ్రాజ్య నిర్మాణం కోసం శివాజీ పని చేయలేదని శివాజీ అంగరక్షకులు ముస్లిములేనని కోశాధికారి కూడా ముస్లిం అని ఆయన తెలిపారు. సర్వ సైన్యాధ్యక్షునిగా శివాజీచే నియమితుడైన డౌలత్కా కూడా ముస్లిం అని సలాం తెలిపారు. శివాజీని అడ్డుపెట్టుకుని మతసామరస్యాన్ని దెబ్బతీయాలని కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆయన తెలిపారు. మతోన్మాదులకు స్థానం లేదని దేశంలో ప్రశాంతత మతసామరస్యాన్ని కాపాడటమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. వాహిదియా మసీదు వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌కె సైదా, ఎండి రెహ్మాన్, యాకూబ్, చానా, షేక్ రెహ్మాన్, కరీం తదితరులు పాల్గొన్నారు.

# మధర్ థెరిస్సా విద్యార్థికి రూ.4 లక్షల వేతనం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధజలోని కొత్తూరులో గల మదర్ తెరిసా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్సి విభాగంలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న బొంత సాయికుమార్ హైదరాబాద్‌లోని హెలిప్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ట్రైనీ డెవలపర్‌గా ఎంపికయ్యారు. సంవత్సరానికి 4 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగావకాశం లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. చలసాని హరికృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా సాయికుమార్‌ను ప్రిన్సిపాల్ డా. హరికృష్ణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, వైస్ ప్రిన్సిపాల్ డా. జి. ఉదయ్ కిరణ్ భార్గవ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. ఎం.వి. రామచంద్ర రావు, సిఎస్సి విభాగాధిపతి పి. మహేశ్వరరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ టి. రాఘవ రాజు తదితరులు అభినందించారు.

# ఇందిరమ్మ గృహప్రవేశాలకు సిద్ధం



**ప్రజాపక్షం/ఖమ్మం :** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఇందిరమ్మ గృహాలు ప్రవేశాలకు రంగం సిద్ధం చేసినట్లు మండల గృహనిర్మాణశాఖ అధికారులు సాయి పవన్, మమతలు తెలిపారు. మొదటి దశలో భాగంగా మార్చి 31 లోపు లక్ష్యాలను పూర్తి చేస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ అధికారులు పేర్కొన్నారు. కొన్ని స్లాబ్ దశలో ఉన్నాయని మరికొన్ని కలరింగులో ఉన్నాయని బిల్లులు ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు వారి వారి ఖాతాలలో జమవుతున్నట్టు పేర్కొన్నారు. ఇసుక ఇటుకలు సిమెంటు ఎప్పటికప్పుడు చౌక ధరలలో వారికి అందుతున్నాయని వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు గృహ నిర్మాణాలు సమాచారాన్ని ఆన్లైన్లో పొందుపరిచే అధికారులకు తెలియపరుస్తున్నట్లు పేర్కొంటున్నారు. మండలంలో మొదటి దశలో 746 మంజూరు కాగా ప్రస్తుతం పలు దశల్లో నిర్మాణాలు ఉన్నాయని 15 ,20 రోజుల్లో పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందిస్తామని మరికొన్ని వెన్నవల్లి , తెలగవరం, చంద్రు పట్ల, మర్లపాడు, కృష్ణయ్య బంజర, పుల్లయ్య బంజర, తూర్పు పడమర లోకవరములు, కొర్లగూడెం, పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి, రఘునాథ బంజర్, తదితర గ్రామాలలో గృహ ప్రవేశాలు అయ్యాయని పేర్కొన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలందిస్తూ ఉన్నామని సంతోషంగా బంధుమిత్రులతో గృహప్రవేశాలు జరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

# 25 నుంచి ఇంటర్ పరీక్షలు



-66 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
-అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 25 నుంచి మార్చి 18 వరకు జరుగుతాయని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్స్, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్, కస్టోడియన్స్‌తో డిఐఈవో కె. రవిబాబు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, బందోబస్తు ద్వారానే ప్రశ్నాపత్రాలు రవాణా చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈనెల 25 నుంచి మార్చి 18 వరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలకు మొదటి సంవత్సరం 17,467 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 17,721 మంది మొత్తం 35,188 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా 66 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించవద్దని తెలిపారు. హాల్‌టికెట్‌లో ఎటువంటి తప్పులు ఉన్న వెంటనే సంబంధిత డిఐఈవో కార్యాలయంకు తెలియజేయాలన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ బోర్డ్ అబ్జర్వర్ సిహెచ్ హేమచంద్ర, హైపవర్ కమిటీ సభ్యులు ఎం. సింహాచలం, డెక్ సభ్యులు ఎన్. విజయకుమారి, సయ్యద్ యూసఫ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యశోదలో అధునాతన సౌకర్యాలతో అత్యవసర సేవలు




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : యశోద హాస్పిటల్ (మలక్‌పేట)లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో అనుభవజ్ఞులైన నిపుణులతో అత్యవసర సేవలు అందిస్తున్నట్లు యశోద ఆసుపత్రి న్యూరోఫిజిషియన్ డాక్టర్ సూరిసెట్టి భరత్ తెలిపారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ సూరిసెట్టి భరత్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం ప్రాంతానికి చెందిన 33 సంవత్సరాల ఎం. ప్రియాంక గత ఏడాది జూన్ 12న వాంతులు, విరోచనాలు తదితర సమస్యలతో కండర బలహీనత వల్ల మలక్‌పేట యశోద ఆసుపత్రిలో చేరారని తెలిపారు. ఆమెకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి పోటాషియం లోపం, శరీరక అస్థిరత గమనించడం జరిగిందన్నారు. ఎలక్ట్రోలైట్ అసమతుల్యతలు, ఆటో ఇమ్యూన్ సంబంధిత మెటబాలిక్ వ్యాధులు సకాలంలో చికిత్స చేయకపోతే ప్రాణాపాయ స్థితికి దారితీసే అవకాశం ఉంటుందని తెలిపారు. మూత్రపిండాల సమస్యలు, ఆటో ఇమ్యూన్ రుగ్మతలతో కలిసి వస్తే నరాల వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ముందస్తు గుర్తింపు సమగ్ర వైద్య మూల్యాంకనం, బహుళ విభాగాల సమన్వయంతో చికిత్స అత్యవసరమవుతుందన్నారు. ప్రియాంకకు కూడా అదేవిధంగా బహు విభాగాల ఆధ్వర్యంలో చికిత్స అందించినట్లు తెలిపారు. న్యూరాలజీ, నెఫ్రాలజీ, రుమటాలజీ, క్రిటికల్ కేర్, జనరల్ మెడిసిన్ తదితర విభాగాల వైద్యులు సమన్వయంతో ప్రియాంకకు చికిత్స అందించడం జరిగిందన్నారు. ప్రియాంక ఆరోగ్యం క్రమంగా కోలుకుని కండరాల బలం మెరుగుపడటంతో పాటు పోటాషియం స్థాయిలు స్థిరంగా ఉన్నాయన్నారు. ప్రియాంకకు అందించిన వైద్యం ఫలితంగా పూర్తి స్థాయిలో కోలుకుని గత ఏడాది జూన్ 18న డిశ్చార్జ్ చేయడం జరిగిందన్నారు. యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మలక్‌పేటలో అన్ని రకాల వైద్య సేవలు అత్యాధునిక సౌకర్యాలతో పాటు అనుభవజ్ఞులైన నిపుణుల ఆధ్వర్యంలో 24 గంటలు అందుబాటులో ఉన్నాయని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ భరత్ తెలిపారు.

# 'జలసిరి జవహర్'తో చివరి భూములకు సాగునీరందిస్తాం



ప్రజాపక్షం/మధిర : సాగర్ జలాల పరిధిలో చివరి ఆయకట్టుగా ఉన్న మధిర, ఎర్రుపాలెం మండలాలకు చెందిన రైతుల పొలాలకు సాగునీరందించే జలసిరి జవహర్ ఎత్తిపోతల పథకమని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు అన్నారు. శుక్రవారం మధిర మండలంలోని వంగవీడు గ్రామం వద్ద వైరా నదిపై రూ.630కోట్లతో నిర్మించ తలపెట్టిన జవహర్ ఎత్తిపోతల పథకం పనులను ఇరిగేషన్ డిఇఇ నాగబ్రహ్మంతో కలిసి ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా బండారు నర్సింహారావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని సాగర్ జలాల చివరి ఆయకట్టుగా ఉన్న మధిర ఎర్రుపాలెం మండలాలకు ప్రస్తుతం సాగర్ జలాలు మూడో జోన్‌లో సరఫరా అవుతున్నాయని అన్నారు. ఈరెండు మండలాలకు సాగర్ నీటిని రెండోజోన్‌లో సరఫరా చేసేందుకు వీలుగా మధిర మండలంలోని వైరా నదిపై వంగవీడు గ్రామంలో రూ.630కోట్లతో మధిర, ఎర్రుపాలెం మండలంలోని రైతులకు మేలు చేసే విధంగా డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క గత సంవత్సరం ఆగస్టు నెలలో శంకుస్థాపన భూమి పూజ చేయటం జరిగిందని తెలిపారు. వచ్చే సంవత్సరం నాటికి ఈ పథకం పూర్తయి సుమారు 50వేల ఎకరాలకు సాగర్ జలాలు అందించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర, ఎర్రుపాలెం మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ సిద్ధిపోగు ప్రసాద్, ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాస్‌రెడ్డి, అనుమోలు వెంకటకృష్ణారావు, చొప్పకట్లపాలెం సర్పంచ్ బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు బాణావత్ రమణానాయక్, గుడేటి బాబురావు, అద్దంకి రవికుమార్, కర్నాటి రామారావు, వెంకయ్యబాబు, నిడమానూరు వంశీ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో సత్తా చాటిన అల్లిపురం వాసి

- జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన నివేద్ రావూరి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : అమెరికా వేదికగా అల్లిపురం ప్రతిష్టను నివేద్ రావూరి ఇనుమడింపజేశారు. ఖమ్మం నగరం అల్లిపురంకు చెందిన సతీష్ రావూరి శిల్పా రావూరి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. వారి కుమారుడు 12 ఏళ్ల నివేద్ రావూరి 2025 సంవత్సరానికి గాను నేషనల్ యూత్ ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకుని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. చిన్న వయస్సులోనే సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, వ్యాపార దక్షితను చాటుతూ ఇంతటి ప్రతిష్టాత్మక పురస్కారం అందుకోవడం గర్వకారణం. సతీష్ రావూరి దంపతులు విదేశాల్లో ఉంటున్నప్పటికీ తమ పిల్లలకు తమ ప్రాంత మూలాలను మరువకుండా విలువలు, క్రమశిక్షణ, కొత్త ఆలోచనలను నాటారు. జాతీయ స్థాయిలో సాధించిన ఈ అవార్డు నివేద్ రావూరి ప్రతిభకు నిదర్శనం. లెమనేడ్ డే కార్యక్రమంలో భాగంగా నివేద్ తన సొంత లెమనేడ్ స్టాల్‌ను ప్రణాళికాబద్ధంగా ప్రారంభించి విజయవంతంగా నిర్వహించాడు. చిన్న ఆలోచనను పెద్ద అవకాశంగా మార్చుకున్నాడు. లక్ష్యాల నిర్ధారణ, బడ్జెట్ నిర్వహణ, వినియోగదారుల సేవ, సమాజంతో అనుబంధం ఇవన్ని అతను చిన్న వయస్సులోనే నేర్చుకున్న జీవన పాఠాలు, ప్రతి గ్లాస్ లెమన్ డే వెనక అతని పట్టుదల ఉంది. ప్రతి చిరునవ్వు వెనక కుటుంబం నేర్పిన సంస్కారం ఉంది. నేషనల్ యూత్ ఎంట్రప్రెన్యూర్ అవార్డును అందుకోవడం చాలా గర్వంగా ఉందని తెలిపారు. నా లెమన్ డే స్టాండ్ ద్వారా డబ్బు నిర్వహణ, లక్ష్య సాధన, సమాజానికి సేవ చేయడం నేర్చుకున్నట్లు, 12 ఏళ్ళ వయస్సులో కూడా పిల్లలు పెద్ద మార్పు తీసుకు రాగలరని ఈ అనుభవం నాకు తెలియజేసిందని నివేద్ తెలిపారు. నివేద్ సాధించిన ఈ ఘనత అల్లిపురంకు గర్వకారణంగా నిలిచింది. జాతీయ స్థాయిలో నివేద్ రాణించడం పట్ల అల్లిపురం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సిరిపురం గ్రామంలో వైద్య శిబిరం



ప్రజాపక్షం/ మధిర టౌన్ : మధిర మండలం సిరిపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో నవశకం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మధిర మండల కిసాన్ సెల్ అధ్యక్షులు దుంప వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు కె.అప్పారావు, నవశకం ఫౌండర్ మేకల రమేష్, సిరిపురం పాలక మండలి సభ్యులు ఇరుగు పుల్లారావు, పవన్‌కళ్యాణ్, నంద్రు విజయరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



ప్రజాపక్షం/ మధిర టౌన్: మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు శుక్రవారం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కృషితో మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేయటం జరిగింది. వివిధ ఆసుపత్రిల్లో చికిత్స పొందిన బాధిత కుటుంబాలకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు చేతులమీదుగా పంపిణీ చేశారు. మధిర, నిధానపురం, రొంపిమళ్ళ, సిద్దినేనిగూడెం, వంగవీడు, మధిర పట్టణానికి చెందిన 20మంది లబ్దిదారులకు రూ.8.49లక్షలు విలువైన చెక్కులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బాణావత్ వెంకటరమణనాయక్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నవీన్‌రెడ్డి, షేక్.జహంగీర్, కోరంపల్లి చంటి, కర్నాటి రామారావు, మువ్వ వెంకయ్యబాబు, పత్తేపురపు సంగయ్య, మాగం ప్రసాద్, బహటం శ్రీనివాస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# మధిర పట్టణాన్ని ప్రగతివైపు నడిపిస్తా..



ప్రజాపక్షం/మధిర : ప్రజలకు కావాల్సిన వైద్యం, రహదారులు, విద్యుత్, మంచినీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మధిర పట్టణాన్ని ప్రగతివైపు పరుగులు పెట్టిస్తానని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత అన్నారు. మధిర మున్సిపాలిటీలో ఏమైనా సమస్యలుంటే ప్రజలు వాటిని తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మధిర మున్సిపాలిటీ పరిధిలోని అంబారుపేట 3వ వార్డు కౌన్సిలర్ బెజ్జం రాజు 3వ వార్డులో మంచినీటి సమస్యను పరిష్కరించాలని చైర్‌పర్సన్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. గత రెండేళ్లుగా అంబారుపేట ప్రజలు మంచినీళ్ల అందక ఇబ్బందులు పడుతున్నారని, దీనికి కారణం గతంలో కురిసినభారీ వర్షాలకు మిషన్ భగీరథ పైప్‌లైన్ కొట్టుకుపోయిందని, అప్పటి నుంచి మంచినీరు రాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన చైర్‌పర్సన్ సుజాత మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలకనుగుణంగా వారి సంక్షేమం, మధిర పట్టణ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు.

# పైప్‌లైన్ పనులను పరిశీలించిన సర్పంచ్

రాత్రి సమయంలో తనిఖీ



ప్రజాపక్షం/వైరా: వైరా మండలం తాటిపూడి గ్రామపంచాయతీలో జరుగుతున్న పైప్‌లైన్ రిపేర్ పనులను రాత్రి పూట సామాన్య వ్యక్తిలా నడుచుకుంటూ వెళ్లి గ్రామ సర్పంచ్ జవ్వాజి అశ్వీని పైప్‌లైన్ నిర్మాణ పనులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని పరిశీలించారు. మహిళా సర్పంచ్ అశ్విని తన ధైర్యాన్ని సైతం చాటుకున్నారు. ఒక్కతే ఎవరికి చెప్పకుండా పైప్‌లైన్ రిపేర్లు వద్దకు వెళ్లి పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు త్రాగునీటి సమస్య రావద్దని ఎవరు ఇబ్బంది పడవద్దు అని తెలిపారు. గ్రామంలో త్రాగునీటి సమస్య రాకుండా ముందస్తుగా చర్యలు చేపట్టడం జరుగుతుందని, పంచాయతీ సిబ్బంది పూర్తిస్థాయిలో పనులను చేసే విధంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

# మిట్టపల్లి సత్యంబాబు దంపతులకు సన్మానం



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని గాంధీచౌక్‌లో ప్రముఖ వ్యాపారవేత్త మాజీ రామాలయం చైర్మన్ మిట్టపల్లి సత్యంబాబు, రాజ్యలక్ష్మి వివాహ వార్షికోత్సవ సందర్భంగా శుక్రవారం వారి ఇంటికి వెళ్లిన బిఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేసి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వనమా విశ్వేశ్వరరావు, కట్టా కృష్ణార్జున్‌రావు, మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, అప్పం సురేష్, 11వ వార్డు కౌన్సిలర్ దొంతెబోయిన వెంకటేశ్వర్లు, నూకల వాసు, నూకల ప్రసాద్, గజ్జల కృష్ణమూర్తి, వనమా చిన్ని, కారుకొండ బోస్, వి.వి.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# మీ ఇంటి బిడ్డగా నా ఆడబిడ్డ సేవలందిస్తుంది..

**- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**
**- అభివృద్ధిలో 30డివిజన్‌నూ అగ్రగామిలో నిలుపుతా : కౌన్సిలర్ శ్రీజ**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** మీ ఇంటి బిడ్డగా నా ఆడబిడ్డ సేవలు అందిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. శుక్రవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 30వ వార్డులోని శ్రీసాయి బృందావనం కాలనీలో అభినందన సభను నిర్వహించారు. కౌన్సిలర్‌గా ఎన్నికైన 28వ వార్డు కౌన్సిలర్ దండి రంగారావు, 30వార్డు కౌన్సిలర్ దండి శ్రీజాను పూలమాలలు వేసి, శాలువులతో సత్కరించారు. అలాగే ఆ కాలనీవాసైనా భగత్‌వీడు తండా సర్పంచ్ భూక్య వసంత లక్ష్మి దంపతులకు సన్మానం చేశారు. తొలుత కాలనీవాసులు మౌలిక వసతులతో పాటు పలు సమస్యలను పరిష్కారం చేయాలని కౌన్సిలర్ శ్రీజకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో దండి సురేష్ మాట్లాడుతూ...ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకైనా భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి శ్రీజాను గెలిపిండచడం అభినందనీయం అని కొనియాడారు. ఏ ఆశలు ఆకాంక్షల కోసమై ప్రజలిచ్చిన ఆశీర్వాదాన్ని నిలబెట్టుకుంటామన్నారు. పిలిస్తే పలికే గొంతుకల ఈవార్డు ప్రజల కష్టసుఖాలలో ప్రాంత అభివృద్ధిలో శ్రీజ అలుపెరగని కృషి చేస్తుందన్నారు. అనంతరం విజయ సూచికకు అభినందనీయంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, కాలనీవాసులు గుడివాడ శ్రీను, సురభి సాయి, సాంబశివరావు, కొప్పుల కిరణ్, ఆంగోతు శ్రీను పాల్గొన్నారు.

**అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతా...**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో 30వ డివిజన్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని కౌన్సిలర్ దండి శ్రీజ అన్నారు. తన గెలుపులో ప్రత్యక్షంగా పరోక్షంగా కృషి చేసిన వారితో పాటు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలిపింది. ప్రజల ఆశలు..ఆకాంక్షలకు అనుగుణంగా తన పని విధానం ఉంటుందన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకు వచ్చి, వార్డు రూపు రేఖలు మారుస్తానన్నారు.

# ప్రతిభను వెలికితీసేందుకే సిఎం కప్ పోటీలు

**-ఆర్చరీ పోటీలను ప్రారంభించిన సిపి సునీల్ దత్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామస్థాయిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సిఎం కప్ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తుందని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. శుక్రవారం సర్దార్ పటేల్ మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఆర్చరీ క్రీడా పోటీలను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడల పట్ల ఆసక్తి కనబర్చాలన్నారు. గ్రామీణ క్రీడలను బలోపేతం చేయడం గ్రామీణ స్థాయిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం సిఎం కప్ పోటీలను నిర్వహిస్తుందన్నారు. గెలుపోటములు కాకుండా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన 230 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాధికారి సునీల్ కుమార్‌రెడ్డి, ఆర్చరీ జిల్లా ప్రెసిడెంట్ సారంగపాణి, కార్యదర్శి పుట్ట శంకరయ్య, ఒలంపిక్ అసోసియేషన్ బాధ్యులు క్రిష్టఫర్ బాబు, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆఫీస్ మేనేజర్ ఉదయ్‌కుమార్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రామారావు, ఆదర్శ్‌కుమార్, రంజాన్, సైదేష్, ముజాహీద్, జిల్లా కోచ్‌లు, మేనేజర్లు, ఆర్చరీ కోచ్ నరేష్ పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :**
ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఖమ్మం నగర సమీపంలోని సూర్య ఆగ్రో ఫార్మ్స్‌లో ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ కళాశాలకు చెందిన 1993 96 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో గురువులను ఘనంగా సత్కరించారు. కళాశాలలో నాడు చదువుకున్న రోజులు, సమాజంలో ప్రస్తుతం ఎదిగిన తీరును గుర్తు చేసుకుంటూ ఆట పాటలతో సందడిగా గడిపారు. సీనియర్ కామర్స్ లెక్చరర్ ఆంజనేయులు దంపతులను వారి ఇంటి వద్ద కలిసి శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ వేడుకల్లో పూర్వ విద్యార్థులుగా వివిధ హోదాల్లో స్థిరపడిన చార్టెట్ అకౌంటెంట్లు త్రినాథ్, సుధీర్, రమేష్, పాణి, సీనియర్ జర్నలిస్టు మైసా పాపారావు, హరి కాశ్యప్, శ్రీపాల్, రంగ, హమీద్, ఎన్‌ఆర్‌ఐ ప్రశాంతి, ఎలక్ట్రికల్ జేఏవో రజని, రాధిక, పావని, మధురి, చంద్రకళ, భారతి తదితరులు పాల్గొన్నారు.



# సాయిస్ఫూర్తిలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

**ఉద్యోగాలకు ఎంపికైన 20 మంది విద్యార్థులు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిదిలోని సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన అంఢ్రీ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఇంజనీర్ పోస్టులకు 20మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరియేట్, కరస్పాండెంట్ దాసరి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 126 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా రాత పరీక్ష, టెక్నికల్, హెచ్‌ఆర్ రౌండ్ల ద్వారా ఎంపిక జరిగిందని.ఈ పరీక్షల్లో సాయి స్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి సిఎస్ఈ, సీఎస్ అండ్ మెషిన్ లెర్నింగ్, ఏఐ అండ్ డేటా సైన్స్, ఈసీఈ విభాగాలకు చెందిన మొత్తం 20 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని, ఎంపికైన వారికి హైదరాబాద్‌లో ఉద్యోగ ఉంటుందని, సంవత్సరానికి రూ.3 లక్షల ప్యాకేజ్ అందుతుందన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త,విద్యాధికులు,హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత,రాజ్యసభ సభ్యులు, సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డా. బండి.పార్థసారథిరెడ్డి , విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విదలు వర్చువల్ గా విద్యార్థినీ, విద్యార్థినీలకు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.వూటుకూరి శేషారత్నకుమారి,కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్.యాకూబ్ , కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ ఆఫీసర్ డా.డియన్ వి కృష్ణారెడ్డి , అన్నీఇంజనీరింగ్ బ్రాంచీల విభాగాధిపతులు పాల్గొన్నారు.



# మున్సిపల్ చైర్ పర్సన్ కార్యాలయం ప్రారంభం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత క్యాంప్ కార్యాలయాన్ని 23వ డివిజన్‌లోని సాయిగణేష్ నగర్‌లో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, తోట పెద్ద వెంకట్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు బానోత్ దివ్య, బానోత్ ప్రసాద్, పూల్‌సింగ్, శేషమ్మ పాల్గొన్నారు.

# బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఎంట్రన్స్ టెస్ట్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** 202627 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ గురుకులాలో 5,6,9 తరగతి వరకు ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఈనెల22న ఎంట్రన్స్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు మద్దులపల్లి గురుకుల ప్రిన్సిపల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ప్రస్తుతం చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులచే పోటో అటెస్ట్ చేసిన హాల్ టికెట్, 202526 విద్యా సంవత్సరానికి సంబంధించిన బోన్‌ఫైడ్ సర్టిఫికెట్ ట్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ వాటర్ బాటిల్, ఎగ్జామ్ పాడ్ తీసుకొచ్చుకోవాలని సూచించారు. ఉదయం 11గంటలకు పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగుతుందన్నారు.

# పెన్షనర్ల బకాయిలను విడుదల చేయాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** పెన్షనర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని పిఆర్‌టియు జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు అన్నారు. బోనకల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ఫెన్షనర్లకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేసి వారికున్న సమస్యల నుండి విముక్తి పొందేలా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ విమరణ పొంది 22 నెలలు గడుస్తున్నప్పటికీ గ్రాట్యూవిటీ, కమిటేన్ జిపిఎఫ్, జిఐఎస్, లీవ్ ఎన్కాష్మెంట్ ఇవ్వకపోవడం వలన ఫెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులతో తీవ్రంగా మనోవేదన చెందుతన్నారని తెలిపారు. పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని, బకాయిలో ఉన్న డిఎలను విడుదల చేయాలని కోరారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని జానకీపురంలో ఆంజనేయస్వామివిగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామంలోని దేవాలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ప్రత్యేక పూజలు, హోమాలు, మంత్రోచ్చారణలు నడుమ వేదపండితుల శాస్త్రోక్తంగా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు మహాన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# నేడు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/వైరా:** వైరాలో సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు నేడు ఉదయం 8.30 గంటలకు వైరా మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు శాంతినగర్‌లోని రైతువేదిక సమీపంలోఉన్న ఖాళీ ప్రదేశంలో వైరా నియోజకవర్గ శాసనసభ్యులు రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించుటకు బంజారా పెద్దలు నిర్ణయించారు అని వైరా తహశీల్దార్ సురేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ నేడు జరిగే వైరాలో సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో మండలంలోని అన్ని గ్రామపంచాయతీలకు చెందిన, వైరా పట్టణంలోని బంజారా సోదరసోదరీమణులు, బంజారా గురువులు, పూజారులు, జగదాంబ టెంపుల్ కమిటీ సభ్యులు, బంజారా సంఘం సభ్యులు బంజారా కమ్యూనిటీ సభ్యులు మండలస్థాయి అధికారులు పాల్గొనాలని తహశీల్దార్ సురేష్, ఎంపిడివో సక్రియ తెలిపారు.

# వేమన శతకంతో
# తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సత్తుపల్లి ప్రతిభ

**విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే రాగమయి, మున్సిపల్ చైర్మన్ రెహానా కమల్ పాషా**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్లో అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థులు రెండు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. 250 మంది ఈఎం విద్యార్థులు వేమన శతక పద్యగళార్చన చేయగా, రెండో తరగతి విద్యార్థులు వేమన శతకంఅష్టావధానం ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమాలు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్లో నమోదు అయ్యాయి.ఈ కార్యక్రమం సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్,సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహ్మద్ రెహానా కమల్ పాషా, సత్తుపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత,ఎంఈఓ,సత్తుపల్లి పట్టణం కాంగ్రెస్ నాయుకులు, కార్యకర్తలు, టాలెంట్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ కాపా చంద్రకళ వైస్‌చైర్మన్‌గా కట్ల సంతోష్ బాధ్యతల స్వీకరణ






**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ, వైస్‌చైర్మన్ కట్ల సంతోష్, వార్డు కౌన్సిలర్లు బాధ్యతల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపాల్ కార్యాలయం నందు జరిగిన ఈ బాధ్యతల స్వీవకరణ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగా రావు, జిల్లా కాంగ్రేస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, మాజీ జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వరరావుతో పాటు పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మున్సిపాల్‌చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కట్ల సంతోష్‌ను తోటి కౌన్సిలర్లు శాలువా కప్పి శుభాకాంక్షలు ఎతలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, నూతన చైర్మన్ వైస్ చైర్మన్‌ను కుర్చీలో కూర్చోబెట్టి బాధ్యతలు స్వీకరణ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన పాలకవ మండలి సభ్యులు బాధ్యతలు స్వీకరణ జరిగింది. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, బంధువులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలు బ్యాంకు లింకేజీలు చెల్లించాలి

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** మహిళా సమాఖ్య సభ్యులు సిఐఎఫ్, స్త్రీనిధి బ్యాంకు లింకేజీలు నూటికి నూరు శాతం తిరిగి చెల్లించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన అన్నారు. చుంచుపల్లి మండల పరిధిలోని సమాఖ్య కార్యాలయంలో జరిగిన సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడారు. పిఎంకేఎస్‌వై ద్వారా చేపడుతున్న అన్ని కార్యక్రమాలను గ్రౌండింగ్ పూర్తి చేయాలని తెలిపారు. మహిళా స ంఘాల ద్వారా తయారవుతున్న స్కూల్ యూనిఫామ్‌లు స్కూల్ విద్యార్థులకే కాకుండా ప్రభుత్వం ఈ సారి నుండి ఆర్‌టిసి డ్రైవర్లు, మెడికల్, ఫైర్ డిపార్ట్ మెంట్ చెందిన యూనిఫామ్‌లు కూడా కుట్టించే విధంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు సజావుగా నడపాలని, మంజూరైన గ్రామసంఘాల భవనాలు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. గ్రామాల్లో పది, ఇంటర్, ఐటిఐ పూర్తి చేసిన 30 సం.లోపు వయస్సున్న యువతీ యువకుల వివరాలు డిఆర్‌డిఏకు అందించాలని



ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్‌డిఓ నీలేష్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సోయం సుజాత, అన్ని మండలాల సమాఖ్య అధ్యక్షులు డిపిఎం, ఎన్ఎఫ్, ఆర్ఎం, ఏపిఎంలు అన్ని మండలాల అకౌంటెంట్‌లు పాల్గొన్నారు.

# స్థానిక కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ



**ప్రజాపక్షం/మణుగూరు:** భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లో పనిచేస్తున్న స్థానిక కాంట్రాక్టర్ల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తానని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. శుక్రవారం మణుగూరులో బిటిపిఎస్ లోకల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేకు వివరిస్తూ.. గత 12 ఏళ్లుగా ప్లాంటు నిర్మాణ సమయం నుండి స్థానిక కాంట్రాక్టర్లు ఎంతో శ్రమించి స్కిల్డ్ మరియు అన్‌స్కిల్డ్ పనులు చేస్తూ స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. అయితే, ఇటీవల కాలంలో స్థానికేతర కాంట్రాక్టర్ల జోక్యం పెరగడం వల్ల స్థానిక కాంట్రాక్టర్లు మరియు కార్మికులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఎమ్మెల్యే స్పందన..:**

కాంట్రాక్టర్ల విన్నపాన్ని సానుకూలంగా విన్న ఎమ్మెల్యే, స్థానికులకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. బిటిపిఎస్ ప్లాంటులో స్కిల్డ్ మరియు అన్‌స్కిల్డ్ పనుల్లో స్థానిక కాంట్రాక్టర్లకే ప్రాధాన్యత ఇచ్చేలా తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. స్థానిక యువతకు, కార్మికులకు అన్యాయం జరగనివ్వనని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో లోకల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు..

# శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు సింగరేణి ఏరియా పీవీ కాలనీలో నిర్వహించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలకు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ని ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, స్వామివారి ఆశీస్సులతో కార్యక్రమం విజయవంతం కావాలని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసి వైస్ ప్రెసిడెంట్ కృష్ణం రాజు, డా. శేషగిరి రావు పాల్గొన్నారు.



# ఎస్సీ గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్‌లోని ఎస్సీ గురుకుల హాస్టల్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం పాల్పడిన సంఘటన శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఫిజిక్స్ పరీక్ష సరిగా రాయపోయాననే మనస్థాపంతో ఒక విద్యార్థిని హాస్టల్ భవనంపై అంతస్తు నుండి దూకి ఆత్మహత్యాయత్నం పాల్పడినట్లు తోటి విద్యార్థులు తెలిపారు. పరీక్షల ఒత్తిడి కారణంగా ఈ ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఈ ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టారు. హాస్టల్ వార్డెన్, పాఠశాల సిబ్బంది విద్యార్థులకు కౌన్సిలర్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

# సోషల్ మీడియా రివ్యూ మీటింగ్‌కు హాజరైన పాయం

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం (ప్రజాభవన్) నందు నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా మరియు యువజన కాంగ్రెస్ ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశంలో పినపాక నియోజకవర్గ శాసనసభ సభ్యులు, ప్రజాసేవకులు పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో సోషల్ మీడియా పాత్ర కీలకమని పేర్కొన్నారు. పార్టీ విధివిధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, యువతను చైతన్యపరచడం మరియు ప్రజా సమస్యలపై సమయానుకూలంగా స్పందించడం పై యువజన శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి యువత ముందుండాలని, సోషల్ మీడియా వేదికలను సమర్థంగా వినియోగిస్తూ ప్రజలకు నిజమైన సమాచారం చేరవేయాలని పిలుపునిచ్చారు.



# బిఎఎస్ఎఫ్ యూఎస్ 341 మిరప రకంపై క్షేత్ర ప్రదర్శన

**ప్రజాపక్షం/పినపాక:** బిఏఎస్ఎఫ్ యూఎస్ 341 మిర్చి రకము పంట అధిక చీడ పీడలను తట్టుకొని అధిక పూత, కాతతో అత్యధిక దిగుబడులు వస్తున్నాయని కంపెనీ టెరిటరీ మేనేజర్ పి స్టీఫెన్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని పాతరెడ్డిపాలెం పంచాయితీలోని అదే గ్రామానికి చెందిన వట్టి శ్రీనివాస్‌రెడ్డి అనే రైతు క్షేత్రాన్ని బిఏఎస్ఎఫ్ యూఎస్ 341 మిరప రకంపై వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులు కలిసి సింగిరెడ్డిపల్లి గ్రామంలో ఉన్న మిర్చి తోటని పరిశీలించారు. ఈసందర్భంగా పంటను పరిశీలించిన సుమారు 300 మందికి పైగా రైతులు బిఏఎస్ఎఫ్ యూఎస్ 341 మిర్చి రకము అధిక చీడపీడలను, తెగుళ్లను తట్టుకొని అధిక పూత, కాయలతో మంచి దిగుబడులు రావడాన్ని ఫీల్డ్‌లో మంచి రంగుతో, అధిక కాతతో ఉండటం చూసిన రైతులు హర్షం, ఆనందం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో విత్తన డీలర్లు రమేష్, రాకేష్ కంపెనీ మార్కెటింగ్ డెవలప్మెంట్ ఆఫీసర్ సీ నరేష్, ఫీల్డ్ అసోసియేట్స్ సిబ్బంది, కంటిపూడి వెంకన్న బాబు, పొనగంటి శ్రీను, కురుకూరి శ్రీనివాసరావు, గీద కొండయ్య, బొడ్డు రాంబాబు, గీద శ్రీను, మునిగేల సంతోష్, పొనగంటి రాంబాబు, పొనగంటి శివకృష్ణ, మంగయ్య, జి వేణుగోపాల్‌రెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# మడత వెంకట్‌గౌడ్‌పై అసత్య ప్రచారం చేస్తే సహించం

**ప్రజాపక్షం/ఇల్లందు:** బిసి సంఘాల జెఏసి రాష్ట్ర కన్వీనర్ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ మడత వెంకట్‌గౌడ్‌పై కొంత మంది చేస్తున్న అసత్య ప్రచారం మానుకోకపోతే తగిన బుద్ధిచెపుతామని మాదిగ జెఏసి నాయకులు హెచ్చరించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ వర్గాల కోసం నిత్యం పోరాడుతున్న మడత వెంకట్‌గౌడ్ ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా ప్రజల కోసం పనిచేస్తున్న వారికి మద్దతుగా ప్రచారం జరిపారని గుర్తు చేశారు. అయిన ప్రచారం చేసిన అన్ని వార్డులో అభ్యర్థులు గెలిచారని, అలాంటి సత్తా ఉన్న నాయకుడిపై ఇటీవల కొంత మంది దురుద్దేశంతో అవాకులు చవాకులు పెలుతున్నారని, వారికి తగిన గుణపాఠం చెపుతామన్నారు. ఈసమావేశంలో పలువురు మాదిగ జెఏసి నాయకులు పాల్గొన్నారు.



# ఎంఎల్‌ఏ కోరంను కలిసిన డిఎస్‌పి

**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు డిఎస్‌పి వెంకన్న బాబు ఎంఎల్‌ఏ కోరం కనకయ్యని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇల్లందు డిఎస్‌పిగా నియమితులైన వెంకన్న బాబు క్యాంప్ కార్యాలయం నందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్యకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఇరువురు ఇల్లందు ప్రాంత శాంతిభద్రతలపై చర్చించారు.



# జీవితాన్ని అందంగా తీర్చిదిద్దేది చదువొక్కటే..

**- సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంఎల్ఏ కూనంనేని**



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** చక్కటి చదువులు జీవితాన్ని తీర్చిదిద్దుతాయని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో పూర్వవిద్యార్థులు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, సరంజన్ కుమార్ అగ్రవాల్ ఆధ్వర్యంలో పూర్వవిద్యార్థులు, పలువురి ఆర్థిక చేయూతతో ఏర్పాటు చదువులు తల్లి సరస్వతి విగ్రహాన్ని ఆయన శుక్రవారం ఆష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ చదువు జీవితాలను మార్చే చక్కటి యంత్రమని, చదువుని నమ్ముకున్న వారు చెడిపోయిన దాఖలాలు లేవని తెలిపారు. పేదవాడిని గొప్పవానిగా మార్చే ఏకైక మార్గం చదువు ఒక్కటే అని ఇక్కడ ఉన్న విద్యార్థులంతా మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలు అదిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న చేయూతను అందుకుని మరింత ముందుకు సాగాలన్నారు. కళాశాల ఆవరణలో సరస్వతి మాత విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం గర్వకారణమని, ఇందుకు ముందుకు వచ్చిన ప్రతీ ఒక్కరూ అభినందనీయులన్నారు. యువతరం ఒక్క చదువులకే పరిమితం కాకుండా మన చుట్టు ప్రక్కల పరిస్థితులతో పాటు దేశంలో జరిగే ప్రతీ అంశాన్ని నిషితంగా పరిశీలించాలని, వార్తా పత్రికలు, న్యూస్ ఛానళ్ల ద్వారా విషయాన్ని మరింత లోతుగా తెలుసుకోవాలని, పుస్తక పఠనం అలవర్చుకుంటే తెలివితేటలు విస్తృతంగా పెరుగుతాయన్నారు. యువతరం మేధోశక్తిని పెంచుకోవడం ఎంతో అవసరమని, దేశ భవిష్యత్‌కు యువతపై ఆధార పడి ఉందన్నారు. అధ్యాపకులు సైతం విద్యార్థులకు జ్ఞానాన్ని పంచాలని, చదువుల్లో వెనుకబడిన వారిని గుర్తించి అసరమైన ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. తాను గతంలో ఎంఎల్ఏగా ఉన్నప్పుడు కళాశాల అభివృద్ధికి నిధులు తీసుకొచ్చామని, ఇప్పుడు కూడా నూనత భవనాల నిర్మాణం కోసం రూ.3 కోట్ల, 86 లక్షల నిధులతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి ఎప్పుడూ ఉంటుందని, రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి మరింత అభివృద్ధి పరిచేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, సరంజన్ కుమార్ అగ్రవాల్, విద్యానగర్ సర్పంచ్ శాంతిప్రియ, జాస్తి రమేష్, కళాశాల ప్రిన్సిపల్ కత్తి రమేష్, జిల్లా జూ.లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర రావు, టిఎన్‌జిఓస్ జిల్లా అధ్యక్షులు సంగం వెంకటపుల్లయ్యతో పాటు సుమారు 500 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సిపిఐలో చేరిన సర్పంచ్ సరస్వతి

**- కండువా కప్పి ఆహ్వానించిన కూనంనేని**



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** పాల్వంచ మండల పరిధిలోని నారాయణరావుపేట ఎస్సీ కాలనీ సర్పంచ్ బండా సరస్వతి సిపిఐ పార్టీలో చేరారు. ఆమెకు ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు శుక్రవారం ఎర్రకండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఇండిపెంటెంట్ అభ్యర్థిగా మొన్నటి గ్రామపంచాయితీ ఎన్నికల్లో 178 ఓట్ల మెజార్టీతో సర్పంచ్‌గా గెలిచిన సరస్వతి ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు సారథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితురాలై సిపిఐ చేరినట్లు తెలిపారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామ పంచాయితీ సమగ్రాభివృద్ధి సాధించాలంటే అది సిపిఐతోనే సాధ్యమని ఆమె అన్నారు. అనంతరం ఎంఎల్ఏ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో చేరిన సర్పంచ్ సరస్వతి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటు పడాలని, పంచాయితీలో ఉన్న ప్రతీ సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని, ప్రజలతో మమేకమై ముందుకు సాగాలని సూచించారు. పాల్వంచ మండల సిపిఐ అనుబంధ రైతు సంఘం అధ్యక్షులు కొంగర అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికలో సిపిఐ నాయకులు వాసిరెడ్డి మురళీ, చలిగంటి శ్రీనివాస్, బొర్రా కేశవులు, రాంబాబు తరులున్నారు.

# మున్సిపల్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా

**-ఎమ్మెల్యే దంపతుల నమ్మకాన్ని నిలబెడతాం**

**-సర్వమత ప్రార్థనలతో బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ రిహానా కమల్ పాషా**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని నూతనంగా మున్సిపల్ చైర్మన్ బాధ్యతలు స్వీకరించిన మహమ్మద్ రెహానా కమల్ పాషా స్పష్టం చేశారు. హిందూ సాంప్రదాయ ప్రకారంగా వేద పండితులు మంత్రోచ్ఛారణ, ముస్లిం మత పెద్దలు, పాస్టర్లు ప్రార్దనలతో సర్వమత సమానంగా మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని అధిరోహించిన రెహానా కమల్ పాషాకు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ రెహనా కమల్ పాషా మాట్లాడుతూ తమ చిరకాల వాంఛైన చైర్మన్ పదవిని సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, రాష్ట్ర నాయకుడు దయానంద్ ల ఆశీస్సులతో అధిరోహించడం ఆనందంగా ఉందని, వారి నమ్మకాన్ని ఎన్నటికీ వమ్ము చేయమన్నారు. ప్రజల ఆశీస్సులు తోటి కౌన్సిలర్ల అండతో సత్తుపల్లి మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి తమ మార్క్ చూపిస్తామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలు త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు ,కోతుల బెడద తదితరాలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బొంతు సుమలత, కౌన్సిలర్లు విడివాడ అపర్ణ, దూదిపాళ్ల రాంబాబు, గ్రాండ్ మౌలాలి, హకీమ్ , శరత్చంద్ర ,నసీమా షరీఫ్, మట్టా ప్రసాద్, ఉప్పు నాగమణి, విజయ్ కుమారి, మందపాటి ప్రభాకర్ రెడ్డి , పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నకేశ రావు, మండల అధ్యక్షుడు శివ వేణు, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి



**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండలంలోని హిమామ్ నగర్ గ్రామం పంచముఖి ఆంజనేయ స్వామి దేవాల యం వద్ద సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుక ఘనంగా జరిగాయి. తెలంగాణలోని బంజారా సమాజం ఆరాధ్య దైవం, ఆధ్యాత్మిక గురువు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుక భక్తి భావంతో ఘనంగా నిర్వహించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ జన్మదిన వేడుక గిరిజన విలవేల్పు,సమాజంలో మూఢనమ్మకాలు, అపోహలను తొలగించి, ధార్మిక విలువలు ప్రచారం చేశారు. బంజారా సంస్కృతి, హిందూ ధర్మ గొప్పతనాన్ని తెలియజేసిన మహానుభావుడు అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి,అధికారులు,ఏన్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లచ్చి రామ్ నాయక్, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

# కూలీల చెల్లింపులో జాప్యం చేయొద్దు

**డిఆర్‌డిఓ జిల్లా అధికారి శ్రీరామ్**



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లో ఇంటి బిల్లు లతో కూలీల చెల్లింపులు విషయంలో జాప్యం చేయొద్దని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కొండపల్లి శ్రీ రామ్ సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ పథకం, ఐకేపీ సిబ్బంది అధికారులు, పంచాయతీ కార్యదర్శి లతో ఆయన సమీక్ష నిర్వహించారు. మండలంలోని 33 పంచాయతీ లలో నర్సరీ లు ఏర్పాటు చేయాలని ప్రతి నర్సరిలో మూడు వేల మొక్కలు నర్సరీల్లో పెంచాలని అన్నారు. ఉపాధి హామీ పథకం లో కూలీలకు చెల్లింపులు మర్చి నెల చివరి నాటికీ చెల్లింపులు జరపాలని అన్నారు. వేసవి కాలం మొదలు అయ్యిందని త్రాగునీటి విషయం లో నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు. ఈ సమీక్ష లో ఏపిడి చలపతి రావు, ఎంపీడీఓ అన్నపూర్ణ, ఉపాధి హామీ ఏపిఓ మధుసూదన్ పాల్గొన్నారు.

# ప్రైవేట్ జూనియర్ కళాశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ

**-తీవ్ర గాయాల పాలైన విద్యార్థి**

**-ఆస్పత్రికి తరలించిన యాజమాన్యం**



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఖానాపురం హవేలీ పోలీసు స్టేషన్ పరిధిలోని వెలుగుమట్ల లో ఉన్న ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలోని హాస్టల్ ఇద్దరు విద్యార్థుల మధ్య తలెత్తిన ఘర్షణ దాడికి దారితీసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అదే కళాశాలకు చెందిన హాస్టల్ లో ఉంటున్నారు. గత శుక్రవారం సాయంత్రం హాస్టల్ మద్యం సేవించి వచ్చిన సదరు ఇద్దరు విద్యార్థులు మైకంలో ఒకరిపై ఒకరు దాడిచేసుకోగా అక్కడే ఉన్న తోటి విద్యార్థులు దీనిని తమ సెల్‌ఫోన్‌లో చిత్రికరించారు. ఆసమయంలో హాస్టల్ వార్డెన్, వాచ్‌మెన్ ఎవరూ లేకపోవడంతో విషయం సదరు విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న కళాశాల యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా ఈవిషయం బయటికి పొక్కకుండా జాగ్రత్తపడి తీవ్ర గాయాలపాలైన విద్యార్థిని స్థానిక అసుపత్రిలో చెర్పించి చికిత్స అందించారు. తల్లిదండ్రులు కళాశాలకు చేరుకుని ఆరాతీయగా హాస్టల్‌లో ఇటువంటి వివాదాలు సహజమేనని యాజమాన్యం తోసిపుచ్చారు. ఈ విషయాన్ని పెద్దది చెస్తే రానున్న పరీక్షలకు హాజరైయ్యేందుకు సదరు విద్యార్థులకు హాల్ టికెట్లు నిలిపివేస్తామని యాజమాన్యం బాధిత తల్లి తండ్రులకు తెలియజేయడంతో మిన్నకుంటిపోయ్యారు. ఈవిషయమై మీడియా ప్రతినిధులు కళాశాల యాజమాన్యన్ని ప్రశ్నించగా సమాధానం ఇచ్చేందుకు నిరాకరించగా ఏటువంటి దాడులు చోటుచేసుకోలేదని చెప్పారు. దీంతో దాడిసమయంలో అక్కడి విద్యార్థులు తీసిన విడియో సోషల్ మీడాయాలో వైరల్ అవుతోందని చూపించడంతో వారు విద్యార్థుల మధ్య చిన్నచిన్న ఘర్షణలు సహజంగా చోటుచేసుకుంటాయని కోట్టిపారేశారు. తల్లిదండ్రులు సైతం దాడికి గల కరణాలను తెలిపేందుకు నిరాకరించారు. తమను యాజమాన్యం ఎవరికి తెలియజేయడం, ఫిర్యాదు చేయవద్దని బెదిరింపులకు పాల్పడుతోందని మాత్రం వెల్లడించారు. ఇదిలా ఉండగా ఘర్షణ పడ్డ ఇద్దరు విద్యార్థులు మద్యం మత్తులో ఉన్నట్లు తోటివిద్యార్థు తెలియజేస్తుండటంతో అసలు హాస్టల్లోకి మద్యం, మత్తు పదార్థాలు ఎలా వచ్చాయనే అనుమానాలు సర్వత్ర చర్చనీయంశంగా మారింది. ఈ విషయమై ఖానాపురం హవేలీ పోలీసుస్టేషన్ సిఐ భానుప్రకాశ్‌ను వివరణ కోరగా గత శుక్రవారం ఈఘటన జరిగినట్లు తెలుస్తోందని కాని తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన విడియో క్లింపింగ్ ఆధారంగా విచారణ చేపట్టనున్నట్లు ఆయన ప్రజాపక్షంకు వివరణ ఇచ్చారు.

# తంబర్ల లక్ష్మి మరణం బాధాకరం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** సిఐటియు జూలూరుపాడు మండల నాయకురాలు వెంగన్నపాలెం గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు తంబర్ల లక్ష్మి మరణం బాధాకరమని సిపిఎం జూలూరుపాడు మండల కార్యదర్శి యాస నరేష్ అన్నారు. సిఐటియు జూలూరుపాడు మండల కన్వీనర్ బోడ అభిమిత్ర లక్ష్మి పార్థివ దేహానికి సిఐటియు జెండా కప్పి నివాళులు అర్పించారు. అనంతరం యాసా నరేష్ మాట్లాడుతూ మండలంలోని ప్రధాన పంచాయతీగా ఉన్నటువంటి వెంగన్నపాలెం పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికురాలుగా విధులు నిర్వహిస్తూ సిఐటియు చేస్తున్నటువంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారని అన్నారు. కార్మికుల కోసం సమ్మెలు ధర్నాలు నిరసన కార్యక్రమంలో ముందుండి కార్మికుల ఐక్యం చేసే దానికోసం కృషి చేసే వారని అన్నారు. కార్మికుల జీతాలు పెంపు కోసం, మరియు ఉద్యోగాల పర్మనెంట్ చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో నిరంతరం సమ్మెలు చేసేవారని, పట్టి సమయంలో ముందు బాగా నిలబడే వారని గుర్తు చేశారు. తంబర్ల లక్ష్మి మృతి పట్ల సిఐటియు వారి కుటుంబానికి సంతాపం తెలియజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు గార్లపాటి వెంకటి వల్లమల్ల చందర్ రావు, బొల్లి లక్ష్మ య్య, బోడ అభిమిత్ర తదితరులు పాల్గొన్నారు.